క్లుప్తంగా

కేఎల్లార్‌ను కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు



కేఎల్లార్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

తుక్కుగూడ: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలక మండలి సభ్యులు, పార్టీ శ్రేణులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై ఆయన చర్చించారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధు, ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయ మందిర నిర్మాణ పనులు వేగిరం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ సీఎంఆర్‌కాలనీలో దశాబ్దంన్నర కాలంగా దత్తాత్రేయ శిరిడీ సాయి మందిర నిర్మాణం పెండింగ్‌లో ఉంది. సోమవారం కాలనీవాసులు సమావేశమై ఆలయాన్ని పూర్తి చేయాలని తీర్మానించుకున్నారు. గతంలో కొన్ని కారణాలతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని వారు పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించి రెండస్తుల భవనం పూర్తి కావొచ్చిందని, డిసెంబర్ 14న దత్తాత్రేయ జయంతి సందర్భంగా ప్రారంభోత్సవం చేయాలని కాలనీవాసులు నిర్ణయం తీసుకున్నారు. కాలనీవాసులు అందరూ సహకరించాలని కోరారు. నాగ శ్రీనివాసశర్మ, కాలనీ అధ్యక్షుడు జనార్థన్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, గుగ్గిళ్ల వినోద్‌గుప్తా, నవీన్, మధు తదితరులు ఉన్నారు.

విజేతలకు అభినందన



విజేత జట్టును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచారు. మహేశ్వరం జోనల్ లెవల్‌లో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు తుక్కుగూడలో నిర్వహించిన ఖోఖో పోటీ అండర్-14 విభాగంలో బాలికల జట్టు, వాలీబాల్ పోటీ అండర్-17 విభాగంలో బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. కాగా సోమవారం విజేత జట్లతో పాటు ఫిజికల్ డైరెక్టర్ స్వామిని పులిమామిడి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బుచ్చయ్యగుప్తా, రాములు, జయంతి, శ్రీవిద్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరీ మరణం తీరనిలోటు

మీర్‌పేట: ఏచూరీ మరణం దేశ ప్రజలకు తీరనిలోటని సీపీఎం రాష్ట్ర నాయకుడు జి.రాములు అన్నారు. ఆదివారం రాత్రి మీర్‌పేట కూడలిలో జరిగిన సీతారాం ఏచూరీ సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మతోన్మాద రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొన్న నాయకుడు ఏచూరీ అని, ఇండియా కూటమిలో కీలకమైన పాత్రను పోషించారని గుర్తుచేశారు. సీతారాం ఆశయసాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వృత్తిదారుల సంఘం ఉపాధ్యక్షుడు యాదగిరిచారి, సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు, నాయకులు

మహేశ్వరం: మండల కేంద్రం గడికోట మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి తడికోట మైదానంలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ సభ్యులు కందాడి శ్రీరామ్, నాయకులు శివ కృష్ణ, శ్రీనివాస్, రాజేశ్, రాఘవేందర్ వంశీ, సయాద్, ప్రణీత్ పలువురు పాల్గొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధం



- 3 నుంచి 12 వరకు శివగంగ ఆలయంలో వేడుకలు
- తొమ్మిదిరోజుల పాటు ప్రత్యేక పూజలందుకోనున్న అమ్మవారు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ముస్తాబైన శివగంగ రాజరాజేశ్వర ఆలయం, శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారు

మహేశ్వరం: మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు 3వ తేదీ నుంచి 12 వరకు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయం ముస్తాబు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామని శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కమార్ పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై రాజరాజేశ్వరీ దేవి, రాజరాజేశ్వరుడు(శివుడు)లకు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి, తమ మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

3వ తేదీ గురువారం.. ఒకటో రోజు అమ్మవారు శ్రీకాత్యాయిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం సుప్రభాత సేవ, సుగంధ ద్రవ్యాభిషేకం, సహస్రనామార్చన, శ్రీలతా హోమం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు జరుగుతాయి. 4న రెండో రోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. 5న మూడోరోజు ఉదయం శ్రీగాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం సుప్రభాత సేవ, ఫలరసాభిషేకం, సహస్రనామార్చన, హోమం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, శ్రీగాయత్రి దేవి సహస్రనామ కుంకుమార్చన, మహామంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 6న నాలుగో రోజు అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. 7న ఐదోరోజు శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శమిస్తారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, శ్రీసూక్త హోమం(ధనప్రాప్తికి), మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 8న ఆరో రోజు శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శమిస్తారు. 9న ఏడో రోజు శ్రీసరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. 10న ఎనిమిదో రోజు శ్రీదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. 11న తొమ్మిదోరోజు శ్రీమహిషాసురమర్దిని దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శమిస్తారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, హోమం(ఇష్టసిద్ధి), మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 12న పదోరోజు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శరమిస్తారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, హోమం(ఇష్టసిద్ధి), మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, సహస్రనామ కుంకుమార్చన, మహా మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. విజయ దశమి(దసరా)పండగరోజు షమీ పూజ, రావణ దహణం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని ఆలయ ఈఓ మురళీకృష్ణ, ఆలయ డైరెక్టర్లు ఎం.రాకేశ్, ఎస్.కన్నయ్య, కె.జగన్, ఎ.సాయిలు, కె.శ్రీశైలం, ఆలయ అర్చకులు వీరేశం, రాజు పంతులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



కందుకూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ తదితరులు

కందుకూరు: క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందిస్తాయని ఎంపీడీఓ సరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్‌జీఎఫ్ మహేశ్వరం జోన్ లెవల్‌లో విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తమపిల్లలను క్రీడల్లో రాణించేలా చేయూతనందించాలని సూచించారు. అనంతరం సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ పోటీలు అండర్-17 బాలికల విభాగంలో తుక్కుగూడ బ్రిలియంట్ స్కూల్, ద్వితీయ స్థానంలో కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాల జట్లు నిలిచాయి. అండర్-14 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో తుక్కుగూడ సీబీఆర్ స్కూల్, ద్వితీయ స్థానంలో మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాల, అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మహేశ్వరం ఎంజేపీ పాఠశాల, కందుకూరు టీటీడబ్ల్యూఆర్ఎస్ స్కూల్ నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలోల మహేశ్వరం ఎంజేపీ పాఠశాల, కందుకూరు టీటీడబ్ల్యూఆర్ఎస్ స్కూల్ నిలిచాయి. విజేతలకు ఎంఈఓ నర్సింహ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోడల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాకి రాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు!

కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో రూ.లక్షలు వెచ్చించి చేపడుతున్న సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందని, దీనికి సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపమే కారణమని పలువురు ఆరోపించారు. అలా చేపట్టిన నిర్మాణాలు నెలలు గడవకుండానే పగుళ్లు పడుతున్నాయని పేర్కొంటున్నారు. అయినప్పటికీ.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పనులు చేపట్టే సమయంలో అధికారులు.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యానికి వదిలేస్తున్నారని, దీంతో నిర్మాణ దారులు నాణ్యత లేని పనులు చేపట్టి, ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. తాజాగా సోమవారం ఇంజాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో సంబంధిత అధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం. ఇదే అంశంపై ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా, పనులు ప్రారంభం కాకముందే పరిశీలించి వెళ్లామని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సైదమ్మ

తలకొండపల్లి: ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రత తప్పనిసరి అని డాక్టర్ సైదమ్మ అన్నారు. సోమవారం మండల పరిధి అంతారంలో గట్టుఇప్పలపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సైదమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబీలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞచేయించి, అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఎన్‌సీడీ డ్రగ్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఆంజనేయులు, ఏఎన్ఎం సునీత, పంచాయతీ కార్యదర్శులు శ్రీశైలం, విజయ భాస్కర్, ఆశా వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించండి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి విన్నవించారు. ఈ మేరకు సోమవారం నాయకులు ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు బిస్మిల్లా కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి తవ్వి కంకర పరిచి వదిలేశారన్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. దీనికి స్పందించిన ఆమె వెంటనే పనులు ప్రారంభించాలని మున్సిపాలిటీ అధికారులకు ఫోన్ చేసి ఆదేశించారు. ఆమెను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు అలీ మన్సూరీ అలీ, బదర్, అబ్దుల్లా గాలీబ్, కరీం తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధి వీరన్నపల్లికి చెందిన బెక్కరి సుప్రీత్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం వీరన్నపల్లికి వెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుప్రీత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూపతిరెడ్డి, నాగమణి, లింగం గౌడ్, జంగమ్మ, మైసయ్య, యాదయ్య, సీనియర్ నేతలు రెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

తలకొండపల్లి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. మండల పరిధి వెల్జాల్ సెక్టార్‌లో సోమవారం జూలపల్లి అంగన్‌వాడీ టీచర్ యశోదమ్మ, గట్టుఇప్పలపల్లి అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, మాదాయిపల్లి కేంద్రంలో పని చేస్తున్న ఆయ బాలమ్మ, వెల్జాల్‌లో ఆయ రామచంద్రమ్మల ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. అంగన్‌వాడీ టీచర్లు వసంత లక్ష్మి, భూషణమ్మ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి బాసట

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు బాసటగా నిలిచారు. మేమున్నమంటూ చేయూతనిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎల్మినేడు గ్రామానికి చెందిన మిత్రుడు రాజు భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మిత్రులు.. సోమవారం రూ.30 నగదు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.

కమ్యూనిటీ హాల్‌ను వినియోగంలోకి తెస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత



కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

తుక్కుగూడ: బీసీ కమ్యూనిటీ హాల్ పనులను పూర్తి చేసి, త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బరిగేల హేమలత రాజుగౌడ్‌లు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలోని అంగడిబజార్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను కమిషనర్ బి.వెంకట్రామ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఈ కమ్యూనిటీ హాల్‌కు పూర్తిస్థాయిలో నిధులు లేకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. మున్సిపాలిటీ నుంచి నిధులు వెచ్చించి పనులు పూర్తిచేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ మధుమోహన్, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, విలాస్, భావన, డీఈఈ యాదయ్య, మేనేజర్ పర్వతాలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్లు ప్రారంభం



శస్త్రచికిత్స చేసేందుకు సిద్ధంగా ఉన్న వైద్యులు

మహేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు డెలివరీ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అమీర్ సిద్దిఖీ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ప్రతి సోమ, శుక్ర వారాల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహించి వారికి సరిపడా మందులు అందజేస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడొద్దని, ఆస్పత్రిలో డెలివరీ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేస్తున్నామని తెలిపారు. 24 గంటలపాటు వైద్యుల పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం గంగారం గ్రామానికి చెందిన గర్భిణికి ఆపరేషన్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



రైతులను సన్మానించిన పాలకవర్గం

పీఏసీఎస్ చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి దోహదపడాలని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందని, వ్యవసాయ భూములు, పట్టా పాసు పుస్తకాలు ఉన్న రైతులు సంఘంలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. రుణమాఫీ కోసం సంఘం పరిధి 641 మంది రైతుల పేర్లను ప్రభుత్వానికి పంపించగా, 252 మందికి మాఫీ అయిందని, మిగతా 329 మందికి కావాల్సి ఉందని పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణలో ఎరువుల నిల్వ పాత భవనం కోల్పోవాల్సి వస్తుందని, ప్రత్యామ్నాయంగా మరో చోట భవనం నిర్మించేందుకు సభ్యులు ఆమోదం తెలపాలని కోరారు. గడిచిన ఆరు మాసాల్లో రూ.11 కోట్ల రుణాలు ఇచ్చామని భరత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులను సత్కరించారు. సంఘం జమాఖర్చుల నివేదికను మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్ సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు బాలనర్సమ్మ, లక్ష్మమ్మ, చిన్న యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాల్‌నర్సింహా, రాములు సిబ్బంది, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు 'రక్షణ కవచం'

- సేఫ్టీ కిట్‌తో ప్రమాదాలకు చెక్
- ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్



కిట్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్న సీఐ బద్యనాథ్ చౌహాన్

కడ్తాల్: గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం 'కాటమయ్య రక్షణ కవచం' సేఫ్టీ మోకులను పంపిణీ చేసిందని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ అన్నారు. సోమవారం మండల పరిధి చరికొండ గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో కడ్తాల్, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పరిధి గీత కార్మికులకు, బీసీ సంక్షేమ శాఖ-ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా సేఫ్టీ మోకు ఉపయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కార్మికులు తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వారి రక్షణ కోసం ప్రభుత్వం రక్షణ కవచం కిట్లను అందజేస్తుందని, వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధి నాలుగు మండలాలకు మొదటి విడతగా 75 కిట్లు మంజూరయ్యాయని తెలిపారు. టీఎఫ్‌టీ లైసెన్స్ కలిగిన వారితో పాటు టాడీ కో-ఆపరేటివ్ సొసైటీస్(టీసీఎస్) సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే కిట్లను పంపిణీ చేస్తామని సీఐ స్పష్టంచేశారు. కిట్టులో తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్, లెగ్‌లూప్ ఉంటాయన్నారు. ప్రస్తుతం వాడే మోకుకు అదనంగా బలమైన రోప్‌ను బిగించడంతో పాటు, కార్మికుల నడుముకు ఉండే ముస్తాదుకు చుట్టూ బెల్ట్ బిగించనున్నట్లు పేర్కొన్నారు. తాటి చెట్టు ఎక్కేటప్పుడు మోకుకు ఉండే సేఫ్టీ రోప్‌ను, వారి నడుముకు ధరించిన బెల్ట్‌కు బిగిస్తారని, తద్వారా చెట్టు ఎక్కేటప్పుడు, దిగే టప్పుడు ప్రమాదవశాత్తు జారి కింద పడకుండా కాపాడుతుందని వెల్లడించారు. కార్యక్రమలో ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, శిక్షణ నిపుణులు వెంకన్న, నరేశ్, నర్సింహ, శ్రీకాంత్, నరేందర్, మధు, ప్రవీణ్, వివిధ గ్రామాల గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'మోత్యా' సేవలు చిరస్మరణీయం



మోత్యా చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, దివంగత దేపావత్ మోత్యానాయక్ సేవలు చిరస్మరణీయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలో మోత్యానాయక్ దశదినకర్మను పురస్కరించుకుని సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్యా చిత్రపటానికి ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమానికి, మండల అభివృద్ధి మోత్యా ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమ్లీ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్, నాయకులు జవహర్‌లాల్, రాందాస్‌నాయక్, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.